సాక్షి
నంద్యాల
శనివారం । 12 । అక్టోబర్ । 2024



ఆయుధ పూజ

బొమ్మలసత్రం: విజయదశమిని పురస్కరించుకుని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయుధపూజ నిర్వహించారు. దుర్గాదేవి చిత్రపటానికి, ఆయుధాలకు ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా పూజలు చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై శుక్రవారం మార్కాపురానికి చెందిన శ్వేత నాట్య అకాడమీ వారి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. పలు భక్తి గీతాలకు నృత్యం చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1.633
ప్రస్తుతం	: 1.632
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 28,490
అవుట్ ఫ్లో	: 27,406

న్యూస్‌రీల్


శ్రీశైలంలో 193 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో శుక్రవారం సాయంత్రం సమయానికి 192.9694 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 45,844 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. గురువారం నుంచి శుక్రవారం వరకు ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 19,406 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా, జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 76,729 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 8.80 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కుడిగట్టు కేంద్రంలో 14.609 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 15.805 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. డ్యాం నీటిమట్టం 880.90 అడుగులకు చేరుకుంది.

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. గోస్పాడు మండలంలో అత్యధికంగా 18.4 మి.మీ. వర్షం పడింది. ఆత్మకూరు మండలంలో 13.6, వెలుగోడులో 13.2, పాములపాడు, బేతంచెర్ల, పగిడ్యాల మండలాల్లో 12.2, శిరివెళ్లలో 10.0, అవుకులో 7.4, మహానందిలో 6.6, శ్రీశైలం 5.2, ప్యాపిలిలో 4.8, నంద్యాల, జూపాడుబంగ్లా మండలాల్లో 3.6, కొత్తపల్లి, రుద్రవరం మండలాల్లో 2.4, నందికొట్కూరులో 1.2, పాణ్యం 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

తపాలా సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్

కర్నూలు(అర్బన్): తపాలా శాఖ అందిస్తున్న అనేక రకాల సేవలను ప్రజలు విరివిగా వినియోగించుకోవాలని కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి అనానరు. 2024 భారత ప్రభుత్వ తపాలా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక హెడ్ పోస్టాఫీసులో 'విత్తియ్య స్వశక్తికరన్ దివస్ ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ అందిస్తున్న చిన్న మొత్తాల పొదుపు, జీవితబీమా, ఆధార్ సేవలు, కామన్ సర్వీస్ సేవలు తదితరాలన్నింటిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే చిన్న మొత్తాల పొదుపు, జీవిత బీమా సేవల్లో లక్ష్యాలను సాధించిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ నూరుల్లా, రహిమాన్, విజయమోహన్, పోస్టుమాస్టర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

నంద్యాల: బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 13 నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని అప్రమత్తం చేయాలని శుక్రవారం ఓ ప్రకటనలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే గ్రామాల్లో మట్టి మిద్దెలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల భవనాల దుస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సకల ప్రదాయిని.. సిద్ధిదాయినీ

శంఖం ఊదుతున్న సాధువు





స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు తెస్తున్న మంత్రి



అశ్వవాహనంపై కొలువైన స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

- శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాలు
- సిద్ధిదాయిని అలంకారంలో భ్రమరాంబాదేవి
- అశ్వవాహనంపై విహరించిన స్వామి,అమ్మవార్లు
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పణ



కళాకారుల నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలంలో దసరా మహోత్సవాలు దేదీప్యమానంగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకుని నీరజనాలు సమర్పిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీశైల దేవస్థానం అధికారులు ప్రతిరోజు స్వామిఅమ్మవార్లను వివిధ క్రతువులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం భ్రమరాంబాదేవి ప్రత్యేక అలంకరణలో దర్శనమివ్వగా..రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయశాఖ మంత్రి పట్టు వస్త్రాలు సమర్పించారు.

సిద్ధిదాయిని స్వరూపంలో భ్రామరీ

దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజు శనివారం శ్రీశైల భ్రమరాంబాదేవిని సిద్ధిదాయినిగా అలంకరించారు. ముందుగా అర్చకులు, వేదపండితులు అమ్మవారి ఆలయం ముందుభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సిద్ధిదాయిని అమ్మవారిని ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు, హారతులిచ్చారు. తర్వాత అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు.

అశ్వవాహనంపై ఆదిదంపతుల విహారం

భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అశ్వవాహనంపై ఊరేగారు. ప్రత్యేకంగా అలంకీకృతులైన స్వామిఅమ్మవార్లను ఆలయంలోని అలంకార మండపంలో ఆశీనులను చేసి ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



డోలు వాయిస్తున్న దృశ్యం

పట్టువస్త్రాల సమర్పణ

స్వామి, అమ్మవార్లకు సంప్రదాయబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పట్టువస్త్రాలు, ఫలాలు, పసుపు, కుంకుమ తలపై పెట్టుకుని స్వామిఅమ్మవార్లకు సమర్పించారు.

శ్రీశైలంలో నేడు..దసరా ఉత్సవాల్లో చివరి రోజు శనివారం పూర్ణాహుతి నిర్వహిస్తారు. భ్రమరాంబాదేవి నిజరూప అలంకారం, స్వామిఅమ్మవార్లకు నందివాహనసేవ, శమీపూజ, తెప్పోత్సవం నిర్వహిస్తారు.

సరసమైన ధరకు నిత్యావసర సరుకులు

- జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యాసర వస్తువులను సరసమైన ధరకు అందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ పేర్కొన్నారు. ఇందుకోసం శుక్రవారం నంద్యాల పట్టణంలోని శ్రీనివాస్‌సెంటర్ సమీపంలో ఉన్న రైతు బజార్‌లో పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని జేసీ ప్రారంభించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో పామ్ ఆయిల్, సన్ ఫ్లవర్ నూనెల ధరలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో నూనె మిల్లుల యజమానులు, వ్యాపారులతో మాట్లాడి వినియోగదారులకు తక్కువ ధరకు వాటిని అందిస్తున్నామన్నారు. నంద్యాల పట్టణంలో శ్రీనివాస్ నగర్ రైతుబజార్‌తో పాటు టెక్కె మార్కెట్ యార్డులో ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఆత్మకూరులో రెండు , నందికొట్కూరు, బనగానపల్లె మండల కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సన్ ఫ్లవర్ ఆయిల్ (లీటరు) రూ.124, పామ్ ఆయిల్ (లీటరు) రూ.110 చొప్పున విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే అన్ని రైతు బజార్లలో టమాటా కేజీ రూ.40, ఉల్లిగడ్డ కేజీ రూ.35 చొప్పున వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు.



వినియోగదారుడికి ఆయిల్ ప్యాకెట్లు అందజేస్తున్న జేసీ విష్ణుచరణ్

దుర్గా మాత వైభవం



మంగళవాయిద్యాలు.. భజనలు.. కోలాటాల మధ్య దుర్గాదేవి శోభాయమానంగా ఊరేగారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో సరికొత్తగా దుర్గాదేవి ఊరేగింపు ఉత్సవం చేపట్టారు. శుక్రవారం ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు శాస్త్రోక్తంగా విశేష పూజలు గావించారు. అనంతరం దుర్గాదేవి అలంకరణలోని అమ్మవారిని సింహవాహనంపై కొలువు ఉంచారు. అశేష భక్త జన వాహిని మధ్య శ్రీమఠం నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ఊరేగింపు కనులపండువగా సాగింది.

– మంత్రాలయం

సంబరం.. సమరం

- నేడు బన్ని ఉత్సవానికి దేవర 'గట్టు' సిద్ధం

దసరా పర్వదినం రోజు జరిగే బన్ని ఉత్సవానికి దేవరగట్టు ముస్తాబైంది. గట్టుపై కొలువైన మాత మాళమ్మ, మల్లేశ్వరుని కల్యాణోత్సవం అనంతరం 'బన్ని' ఉత్సవంగా జరిగే కార్యక్రమానికి ఎంతో ప్రత్యేక ఉంది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి దాదాపు లక్షన్నరకు పైగా భక్తులు తరలిరానున్నట్లు అధికారులు అంచనా వేసి ఏర్పాట్లు చేశారు. దేవరగట్టు ఆలయ నిర్వాహణ బాధ్యత మోస్తున్న పరిసర గ్రామాలైన నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు విజయదశమి రోజు రాత్రి భారీ సంఖ్యలో దేవరగట్టుకు చేరుకుంటారు. అక్కడ చెరువుకట్ట (డొళ్లిన బండే) వద్దకు చేరి కక్షలు, కార్పణ్యాలు లేకుండా కలిసికట్టుగా ఉత్సవాన్ని జరుపుకుందామని పాలబాస తీసుకుంటారు. అనంతరం కాడప్ప మఠంలో ఉంచిన మల్లేశ్వరుని ఉత్సవ విగ్రహాన్ని కొండపైకి తీసుకెళ్లి మాళమ్మ ఉత్సవ విగ్రహంతో కల్యాణోత్సవం జరిపిస్తారు. అనంతరం ఉత్సవ మూర్తులను తీసుకుని జైత్రయాత్రను సాగించడానికి కొండ దిగే వేళ కర్రలు గాలిలోకి లేస్తాయి. దివిటీలు భగ్గుమంటాయి. ఈ సమయంలో కర్రలు భక్తుల తలలకు తగిలి గాయపడతారు. నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, ఎల్లార్తి, సుళువాయి, అరికెర, అరికెరతాండా, కురుకుంద, లింగంపల్లి తదితర గ్రామాల భక్తులు కల్యాణోత్సవం అనంతరం జరిగే ఈ మొగలాయిలో పాల్గొంటారు.



దేవరగట్టు ఏరియల్ వ్యూ



లక్కు కిక్కు..ఎవరికో!

- ప్రైవేటు మద్యం దుకాణాల దరఖాస్తుకు ముగిసిన గడువు
- ఉమ్మడి జిల్లాలో 204 దుకాణాలకు 5,168 దరఖాస్తులు
- జనాభా ఆధారంగా ఫీజు వసూళ్లు
- 14న లక్కీడిప్
- ఏర్పాట్లలో ఎక్సైజ్ అధికారులు



కర్నూలులో ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తుల వివరాలను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మద్యం దుకాణాల దరఖాస్తులు ఇలా...

ఎక్సైజ్ స్టేషన్	దుకాణాల సంఖ్య	దరఖాస్తుల సంఖ్య
ఆళ్లగడ్డ	19	325
ఆత్మకూరు	13	248
బనగానపల్లె	12	168
డోన్	16	370
కోవెలకుంట్ల	11	150
నందికొట్కూరు	10	181
నంద్యాల	24	713
మొత్తం	105	2,155

కర్నూలు: అధికార పార్టీ నేతల బెదిరింపులు, సిండికేట్ల పంచాయతీలు, వ్యాపారుల తర్జనభర్జనల మధ్య జిల్లాలో మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల దాఖలు ప్రక్రియ ముగిసింది. వ్యాపార వాంఛ, మద్య వర్గాల రాయబేరాల ఘటనలు పలు నియోజకవర్గాల్లో చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీలో దుకాణం దక్కించుకోవడానికి అధికార పార్టీ నేతలు, దళారులు (సిండికేట్లు) ఎత్తులకు పైఎత్తులు వేస్తూ దరఖాస్తులు సమర్పించారు. ఐదేళ్ల తర్వాత అమలులోకి వచ్చిన నూతన మద్యం పాలసీ వ్యాపారుల్లో కూడా కిక్కు పెంచింది. లైసెన్స్ ఫీజు ఆరు విడతలుగా చెల్లించుకునే వెసులుబాటు ఉండటంతో వ్యాపారులు కొన్ని దుకాణాలకు తీవ్రంగా పోటీ పడ్డారు. ఆదాయాన్ని పెంచుకునేందుకు రెండు రోజుల పాటు ప్రభుత్వం గడువు పెంచడం వల్ల దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది. మద్యం దుకాణాల కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నాయకులు తమ బినామీల పేర్లతో దరఖాస్తులు వేయించారు. కొందరు వ్యాపారంపై కనీస అవగాహన లేకపోయినప్పటికీ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. లాటరీలో తగిలితే దరఖాస్తు విలువ రూ.2 లక్షల బదులు ఐదు రెట్లు ఎక్కువగా వేరే వారికి ఇచ్చేయవచ్చనే ఆలోచనతో దరఖాస్తు చేశారు. దరఖాస్తుల దాఖలులో ఎక్సైజ్ శాఖ ఊహించిన స్థాయిలో స్పందన లభించింది.

ఉమ్మడి జిల్లాలో 5 వేల పైచిలుకు దరఖాస్తులు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో శుక్రవారం రాత్రి 7 గంటల సమయానికి 5,168 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇందులో కర్నూలు జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 99 దుకాణాలకు గాను 3,013 దరఖాస్తులు వచ్చాయి. దుకాణానికి సగటున 30కి పైగా దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా కర్నూలు స్టేషన్ పరిధిలో 31 దుకాణాలకు 1,427 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అత్యల్పంగా కోసిగి స్టేషన్ పరిధిలో 4 దుకాణాలకు కేవలం 53 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. అలాగే నంద్యాల జిల్లాలో ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 105 దుకాణాలకు గాను 2,155 దరఖాస్తులు వచ్చాయి. దుకాణానికి సగటున 20 దరఖాస్తులు దాఖలయ్యాయి. జిల్లాలో అత్యధికంగా నంద్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 24 దుకాణాలకు 713 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యల్పంగా కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11 దుకాణాలకు కేవలం 150 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాయంత్రం 7 గంటలకు ముగిసింది. అయితే ఆఫ్‌లైన్ పద్ధతిలో ఇదివరకే నమోదు చేసుకున్న వారి వివరాలు సంబంధిత స్టేషన్ అధికారి తన లాగిన్‌లో నమోదు చేసే అవకాశమున్నందున స్టేషన్ల వారీగా ప్రక్రియ రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. అప్లికేషన్ రుసుం డీడీ రూపంలో తీసుకున్న వారికి రాత్రి 12 గంటల వరకు ఎంట్రీ పాస్ జారీ చేశారు. ఆన్‌లైన్‌లో గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు పేమెంట్ కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తే రాత్రి 12 గంటల వరకు ఎంట్రీ పాస్ డౌన్‌లోడ్ అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

14న లాటరీ ద్వారా కేటాయింపు...

మద్యం దుకాణాలను ఈనెల 14న లాటరీ విధానంలో కేటాయించడానికి ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి ఎక్సైజ్ స్టేషన్ల వారీగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో దరఖాస్తుల స్వీకరణలో నిమగ్నమై ఉన్న ఎక్సైజ్ యంత్రాంగం ఆ ప్రక్రియ పూర్తి కావడంతో లక్కీడిప్ నిర్వహణపై దృష్టి సారించారు. కర్నూలులో జిల్లాపరిషత్ సమావేశ భవనంలో, నంద్యాలలో కలెక్టరేట్ భవనంలో ఆయా జిల్లాల కలెక్టర్ల సమక్షంలో కార్యక్రమం జరగనుంది. దరఖాస్తుల ద్వారానే ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ.103.40 కోట్లు ఆదాయం సమకూరింది.

టీటీడీ తరహాలో శ్రీశైల అభివృద్ధి



శ్రీశైలంటెంపుల్: తిరుమల తిరుపతి తరహాలో శ్రీశైలాన్ని కూడా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన భ్రమరాంబాసమేత మల్లికార్జునస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ శ్రీశైల క్షేత్ర అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పర్యాటక రంగం నుంచి ప్రసాద్ పథకం ద్వారా రూ.100 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. క్షేత్ర అభివృద్ధికి వేల ఎకరాల భూమి అవసరమని, ఈ దిశగా గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన చర్యల గురించి అధికారులను అడిగినట్లు తెలిపారు. అటవీశాఖ నుంచి ఎదురయ్యే అడ్డంకులను ఆశాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌తో చర్చించి పరిష్కరిస్తామన్నారు. శ్రీశైల దేవస్థానానికి చెందిన భూమి దేవస్థానానికే దక్కేలా చూస్తామన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి

శక్తికి ప్రతీక దసరా

కర్నూలు కల్చరల్: శక్తికి ప్రతీక దసరా పండుగ అని విశ్వ హిందూ పరిషత్ ఏపీ సంఘటన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ఆర్‌ఎస్‌ఎస్ దసరా ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925లో దసరా పర్వదినాన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రారంభమైందన్నారు. అనాదిగా మనదేశంలో చెడు మీద మంచి సాధించిన విజయ పరంపరకు విజయ దశమి ఉత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. మోడరన్ ఐ హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు రాజశేఖర్ అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ వాసురెడ్డి పాల్గొన్నారు.

ఇదేమి టెండరింగ్!

- పత్రికా ప్రకటనలు లేకుండా ఇసుకకు షార్ట్ టెండర్లు
- మైనింగ్ వెబ్‌సైట్‌లో మాత్రమే టెండర్ ప్రకటన
- 7–10 వరకూ నాలుగు రోజులు మాత్రమే టెండర్లకు అనుమతి
- బంగారయ్య అనే వ్యక్తి మాత్రమే టెండర్ దాఖలు

కర్నూలు న్యూసిటీ: ఇసుక టెండర్లలో ప్రభుత్వం నిబంధనలకు తిలోదకాలిచ్చి ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఇసుకను సరఫరా చేసేందుకు కౌతాళం మండలంలోని మరళి ఇసుక రీచ్‌కు టెండర్లు పిలిచారు. అయితే ఈ టెండర్లను షార్ట్‌టెండర్లుగా ప్రభుత్వం పిలిచింది. పైగా నిబంధనల మేరకు టెండర్లకు ప్రధాన పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలి. కానీ నోటిఫికేషన్ లేకుండా కేవలం మైనింగ్‌శాఖ వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రకటన ఇచ్చారు. దీంతో మంత్రాలయం నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు బంగారయ్య మాత్రమే టెండర్ దాఖలు చేశారు. ఈ టెండర్ వ్యవహారం నిశితంగా పరిశీలిస్తే పక్కా ప్రణాళిక ప్రకారం ఎవరికీ సమాచారం తెలీకుండా, ఎవరూ పోటీకి రాకుండా టీడీపీ నేతలు సూచించిన వారికి టెండర్ కట్టబెట్టేలా అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు స్పష్టమవుతోంది.

నిర్ణయించిన ధరకే టెండర్

తుంగభద్ర నదిలో నుంచి ఇసుకను తవ్వి, ఒడ్డున యార్డుకు చేర్చి, ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్లు, టిప్పర్లకు లోడింగ్ చేయాలి. దీని కోసం ప్రభుత్వం టన్నుకు రూ.109 ధర నిర్ణయించింది. బంగారయ్య రూ.109.50తో టెండర్ కోడ్ చేశారు. నిబంధనల ప్రకారం రెండు లేదా అంతకంటే ఎక్కువ టెండర్లు ఉంటేనే ఎల్–1గా ఎవరు నిలుస్తారో వారికి టెండర్ కేటాయించాలి. ఒక్కరే టెండర్ వేసే దాన్ని రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాలి. దీనిపై మైనింగ్‌శాఖ డీడీ రవిచంద్‌ను వివరణ కోరగా ఒక్క టెండర్ ఉన్నా ఆమోదిస్తామని తెలిపారు. నిబంధనల మేరకే టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు.

సీ.బెళగల్ రీచ్.. అక్రమార్కులకు వరం

జిల్లాలో ఇప్పటికే సి.బెళగల్ మండలంలో ఐదు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశారు. అక్కడ నీటి పారుదల శాఖ ఇసుకను నది నుంచి యంత్రాల సాయంతో బయటకు తీసి డంప్ చేసి ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీలకు నింపుతున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో ఇసుకను బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఇసుక సరఫరా విధానం ప్రభుత్వం పెట్టడంతో ఆన్‌లైన్ బుకింగ్ అక్రమార్కుల పాలిట వరంగా మారింది. ఆన్‌లైన్ విధానం పోర్టల్ ఎప్పుడు ఆన్ అవుతుందో, ఎప్పుడు ఆఫ్ అవుతుందో సామాన్య ప్రజలకు అంతు పట్టడం లేదు. దీంతో ఉచిత ఇసుక అందని ద్రాక్షలా మారింది. మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల నెరవేరడం లేదు. మరోవైపు ఇసుక కొరతతో భవన నిర్మాణాలు ఆగిపోవడంతో జిల్లా వ్యాప్తంగా రోజుకు 30 వేల నుంచి 40 వేల మంది ఉపాధిని కోల్పోతున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

మహానందిలో సీఐడీ డైరెక్టర్ పూజలు


మహానందీశ్వరుడి సన్నిధిలో సీఐడీ డైరెక్టర్ నగేష్, కుటుంబ సభ్యులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో సీఐడీ డైరెక్టర్ నగేష్ పూజలు నిర్వహించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన వచ్చారు. ముందుగా ఆయన శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఆయన వెంట సీఐడీ ఎస్‌ఐ భరత్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మణ్, సుధీర్, రామిరెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో ప్రతిభ

బేతంచెర్ల: అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో బేతంచెర్లకు చెందిన ఓ యువతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. తిరుమలేష్ చౌదరి, ఉమామహేశ్వరి దంపతుల కుమార్తె అయిన మైత్రీ హైదరాబాద్‌లోని వీఎస్ఆర్ విజ్ఞాన్ కళాశాలలో నాలుగో సంవత్సరం బీటెక్ చదువుతోంది. ఈమెకు త్రోబాల్ క్రీడంటే ఎంతో ఆసక్తి. దీంతో చదువుతోపాటు అందులోనూ రాణిస్తోంది. ఈనెల 10న అంతర్జాతీయ స్థాయి ఇండో–థాయ్‌లాండ్ త్రోబాల్ టెస్ట్ సిరీస్ -2024 పోటీలు థాయ్‌లాండ్ దేశంలో జరిగాయి. శ్రీలంక, ఇండియా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్ తదితర దేశాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. బేతంచెర్ల పట్టణానికి చెందిన మైత్రి ఇండియా జట్టు తరఫున ఆడి ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ యువతిని తల్లిదండ్రులతో పాటు పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థిని మైత్రి

380 మెట్రిక్ టన్నుల ఇసుక డంప్‌లు సీజ్

కర్నూలు: కర్నూలు మండలం పంచలింగాల గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 380 మెట్రిక్ టన్నుల ఇసుకను అధికారులు సీజ్ చేశారు. కొందరు తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుకను తోడి రహస్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. తర్వాత ఆ ఇసుకను ట్రాక్టర్లు, లారీల్లో రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం అందడంతో కర్నూలు అర్బన్ తాలూకా ఎస్‌ఐ పీరయ్య, మైనింగ్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ కుమార్, రెవెన్యూ విభాగం నుంచి వీఆర్వో మద్దిలేటి వారివారి సిబ్బందితో బృందాలుగా ఏర్పడి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పలు చోట్ల ఇసుకను అక్రమంగా డంప్ చేసినట్లు గుర్తించి మొత్తం 380 మెట్రిక్ టన్నులను సీజ్ చేశారు. ఆ ఇసుకను ప్రభుత్వ నిర్మాణ పనులకు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.


పంచలింగాల శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కోలుకోలేక యువకుడి మృతి


అబ్దుల్లా (ఫైల్)

మిడుతూరు: విద్యుదాఘాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఏఎస్‌ఐ సుబ్బయ్య తెలిపిన వివరాలు.. నాగలూటి గ్రామానికి చెందిన పింజరి అబ్దుల్లా(31) మిడుతూరు విద్యుత్ ఉపకేంద్రంలో నైట్ వాచ్‌మెన్, చింతలపల్లి విద్యుత్ శాఖలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. రోజు వారి విధుల నిమిత్తం గత నెల 21న చింతలపల్లి విద్యుత్ కార్యాలయంలో ఎల్‌సీ తీసుకుని స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మధ్యాహ్నం మృతిచెందాడు. కాగా నిర్లక్ష్యంగా ఎల్‌సీ రిటర్న్ చేసిన లైన్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మృతుడి తల్లి రజియాబీ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు, చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

కర్నూలు (అగ్రికల్చర్): స్థానిక నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తిపై దాడి చేసిన కేసులో నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఒక స్థలం విషయమై శ్రీనివాసరెడ్డికి వేర్వేరు కాలనీలకు చెందిన రమణయ్య, రమణ, గంగాధర్, మరొకరికి వివాదం ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ నలుగురు శ్రీనివాసరెడ్డిపై కత్తులతో దాడి చేసి గాయపరిచారు. తర్వాత అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ ఆర్టీఓ అధికారుల అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీరామ్

ఆదోని అర్బన్: ఆర్టీఓ అధికారులమని బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న అంబేడ్కర్ నగర్‌కు చెందిన మాల అశోక్, పొట్లపాడు వీరేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను వన్ టౌన్ సీఐ శ్రీరామ్ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. కేరళ రాష్ట్రం మలప్పురమ్ జిల్లా మొదపోకకు చెందిన లారీ డ్రైవర్ సుభీష్, క్లీనర్ వినోద్ తాండూరు నుంచి నాపరాయి లోడుతో తిరుగు ప్రయాణమయ్యారు. ఈనెల 7న రాత్రి 11.30 గంటల సమయంలో ఆదోని కొత్త బ్రిడ్జి వద్దకు చేరుకోగానే రోడ్డుపై నిల్చుకున్న ఇద్దరు వ్యక్తులు లారీని ఆపి తాళాలు తీసుకుని, తాము ఆర్టీఓ అధికారులమని రికార్డులు చూపించాలని గదమాయించారు. అన్నీ చూపించినా లారీని వదలాలంటే రూ.లక్ష ఫోన్ పే చేయాలని డిమాండ్ చేశారు. అంత డబ్బు లేదన్నందుకు క్లీనర్ చేతిలోని ఫోన్ లాక్కుని కింద పడేసి, దాడి చేశారు. డ్రైవర్, క్లీనర్ గట్టిగా కేకలు వేయడంతో అటువైపుగా వెళ్లే ప్రయాణికులు అక్కడికి చేరుకునేలోపే పారిపోయారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అంబేడ్కర్ నగర్‌కు చెందిన మాల అశోక్, పొట్లపాడు వీరేష్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

డెంగీ పాజిటివ్ కేసు నమోదు


చాగలమర్రిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని 9వ వార్డు మౌలానా జూనియర్ కళాశాల ప్రాంతంలో ఏడాది వయస్సు గల చిన్నారికి డెంగీ పాజిటివ్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ నివసించే 62 కుటుంబాల నుంచి వైద్యసిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. అలాగే పరిసరాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సుమారు 32 మందిని పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్ర, ఏఎన్‌ఎం గార్లెట్, హెల్త్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, మనోహర్, పంచాయతీ సిబ్బంది షేక్షావలి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీపై ఉల్లి, టమాట పంపిణీ

నంద్యాల (న్యూటౌన్): నేటి నుంచి నంద్యాల టెక్కె, శ్రీనివాసనగర్ రైతు బజార్లలో తక్కువ ధరకే ఉల్లి, టమాటా విక్రయిస్తున్నట్లు జిల్లా అగ్రి ట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రహిమాన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కిలో ఉల్లి, టమాటా రూ.35 చొప్పున పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దొంగ అరెస్టు

నందికొట్కూరు: మూగజీవాల చోరీకి పాల్పడిన దొంగను నందికొట్కూరు పోలీసులు పట్టుకున్నారు.రెండురోజుల క్రితం పట్టణానికి చెందిన చాకలి పాండురంగడుకు సంబంధించిన రెండుగొర్రెలు, మూడు మేకపోతులు, పెట్రోల్‌పంపు చోరీకి గురైంది. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన చుక్కబొట్ల ప్రవీణ్ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం అంగీకరించడంతో అతని నుంచి మూగజీవాలు, పెట్రోల్‌పంపు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.


దొంగను అరెస్టు చూపిస్తున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

కోటేకల్ కొండల్లో చిరుతల సంచారం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ గ్రామ కొండల్లో చిరుతల సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన జి.రామకృష్ణ మందలోని ఓ గొర్రెను చిరుత చంపేసింది. దీంతో కాపరులు, రైతులు భయపడుతున్నారు. పరిసర కొండల్లో మూడు చిరుతలు సంచరిస్తూ ఉన్నాయని, వాటిని బంధించి వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతున్నా అటవీ శాఖ అధికారులు స్పందించటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చిరుతలను బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్:దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా విశేష పూజలు అందుకున్న దుర్గామాత విగ్రహాల నిమజ్జన వేడుక ఈనెల 13వ తేదీ ఆదివారం తుంగభద్రా నది తీరంలోని సంకల్‌బాగ్ దుర్గాఘాట్‌లో జరగనుంది. దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవ సమితి, గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో దుర్గాఘాట్‌లో జరిగే కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 120 విగ్రహాలు శోభాయాత్రగా దుర్గా ఘాట్‌కు చేరుకోనున్నాయి. మహిళలు బోనాలు, కలశాలతో యాత్రలో పాల్గొననున్నారు. సాయంత్రం 5 గంటలకు అతిథులు గంగమ్మకు పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ప్రారంభిస్తారు.దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి.ఘాట్ వద్ద ప్రధాన వేదిక, క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జ నాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఫ్లడ్‌లైట్లు,రంగు రంగుల విద్యుత్ దీపాలు, సాంస్కృతిక ప్రదర్శనల వేదిక, స్వాగత ద్వారాలను సిద్ధం చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. నిమజ్జన ఘాట్ వద్ద ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

రిజర్వాయర్‌లో గుర్తు తెలియని మృతదేహం

సంజామల: అవుకు సమీపంలోని రిజర్వాయర్‌లో శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని ఓ మృత దేహం కనిపించింది. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిశీలించారు. అయితే, రాత్రి కావడంతో మృత దేహం బయటికి తీయడానికి వీలుకాలేదని పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES

■ M.S.R ఆటో కన్సల్టెన్సీ: 15సం॥లు పైబడిన అన్ని రకముల వాహనములు, ఎంత పాతవైనా, ఇంజన్ సీజ్ అయినా కొనబడును. Note: ఒరిజినల్ రికార్డ్స్‌తో సంప్రదించగలరు. ✆ 95537 70909, 93928 88275. [L-794935]

REAL ESTATE

■ వేగంగా అభివృద్ధి చెందుతున్న కర్నూలు సిటీలో ప్లాట్లు, భూములు, ఇండ్లు కొనాలన్నా, అమ్మాలన్నా సంప్రదించండి: జె.వై.శాస్త్రి, సెల్: 96762 11033. [L-796561]

PLOT FOR SALE

■ కర్నూలు-పసుపుల గ్రామం బి.తాండ్రపాడు సర్వే నెం: 43, ప్లాటు నెంబర్ 304లో 5.1/2 సెంటు (40x60) అడుగుల స్థలం అమ్మకమునకు కలదు. సంప్ర: కె.పురుషోత్తం: 9392950888. [L-796353]

■ చంద్రమౌళి నగర్, బి-బ్లాక్ నందు గల కార్నర్, తూర్పు దక్షిణ ముఖము 2.50 సెంట్ల ప్లాటు అమ్మకమునకు కలదు. No Brokerage, Contact Cell: 9963289123, 8125496098. [L-796581]

■ ఫ్యూచర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వారి న్యూ వెంచర్ అక్షయ డ్రీమ్ వ్యాలీ హుస్సేనాపురం ఊరు ఆనుకొని వివిధ వెంచర్ల మధ్యన తక్షణం ఇల్లు కట్టుకొనే అవకాశం కలదు. తక్కువ ధరకు ప్లాట్లు అమ్మబడును. సంప్ర: 6300265849. [L-796572]

■ దసరా ఆఫర్: 2,50,000/- లకే 11 సెంట్లు (4.4 గుంటలు) 532 గ॥ ప్రకాశం జిల్లా, అద్దంకి దగ్గర 48 ఎర్రచందనం మొక్కలతో ఫామ్‌ల్యాండ్ అమ్మకం. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 95234 56789. [B-1248596]

■ వర్గిరెడ్డి బ్లూమ్ గార్డెన్ కుడా (KUDA) అప్రూవ్డ్, 40 అడుగుల సిమెంట్ రోడ్లు, ప్రతి ప్లాట్‌కి నీటి సదుపాయం & కరెంట్ కనెక్షన్ అన్ని సౌకర్యాలతో ఇంటి నిర్మాణానికి రెడీగా ఉన్న ప్లాట్లు, లేఔట్‌కి తూర్పున ప్యాపిలి ఊరిలోకి వెళ్లే ఓల్డ్ హైవే, పడమర NH-44 కస్తూర్బా హైస్కూల్ ఎదురుగా, ప్యాపిలి. సంప్ర:9014241439,7207334543. [A-360]

FLAT FOR SALE

■ కర్నూలు డాక్టర్స్ కాలనీలో పైనీర్ White Palace 14 సెంట్లలో నిర్మించబడుతున్న G+4 బిల్డింగ్‌లో 2వ ఫ్లోర్, 1,3వ ఫ్లోర్‌లో 1 ఇల్లు అమ్మబడును. ✆ 9880112222 [L-796578]

SHOP FOR SALE

■ Kurnool Premium Location Bangul Bazar Main Road, (62x15ft) Shop For Sale. No Agents & Brokers, Value 4.3cr. Slightly Negotiable. 9032051513, 9640778852. [L-796582]

HOUSE FOR SALE

■ కర్నూలు మమతానగర్ ప్రక్కన భవాని నగర్‌లో 5.1/2 సెంట్లలో నిర్మించబడుతున్న G+3 బిల్డింగ్‌లో 2వ ఫ్లోర్‌లో 2 ఇండ్లు & 3వ ఫ్లోర్‌లో 1 ఇల్లు అమ్మబడును. ✆ 7981561643. [L-796573]

■ తూర్పు-ఉత్తరం కార్నర్, నూతనంగా నిర్మించిన Duplex House (G+2) Fullly furnished (3000 sft) నంద్యాల చెక్‌పోస్ట్ దగ్గర, వినాయక గుడి వెనుక భాగములో అమ్మకమునకు కలదు. Bedrooms 5 No.s, Halls 3No.s, Corridors 3No.s, Car Parking, Bore కలవు. సంప్రదించండి: 9440282771, 9703741054. [L-794926]

LEASE / RENT

■ గుత్తి హైవే రోడ్డుకి దూపాడు రైల్వే స్టేషన్ ప్రక్కన 60 వేల నుంచి 65 వేల చదరపు అడుగులలో గోడౌన్ నిర్మించి లీజుకు ఇవ్వబడును. ఆసక్తి గలవారు సంప్ర: 98859 06662 [L-794930]

TO - LET

■ 2300 Sqft Shed for Rent Near & Behind Vaartha Office, Nandikotkur Road, Vasavi Nagar, Kurnool. ✆ 9949004902, 7799273030. [L-794934]

SERVICES

HEALTH CARE

AYURVEDIC

■ డా॥M.మహిపాల్, M.S.,(AYU) పైల్స్, ఫిస్టులా, ఫిషర్‌కు ఆయుర్వేద క్షార సూత్ర ద్వారా శాశ్వత పరిష్కారం. ప్రతి నెల 2వ మరియు 4వ ఆదివారం చూడబడును. శ్రీ వెంకటసాయి ఆయుర్వేదిక్ హాస్పిటల్, వి.ఆర్.కాలనీ, కర్నూలు. ఫోన్: 99599 49739. [L-783332]

UNANI

■ దీర్ఘకాలిక క్యాన్సర్, కిడ్నీ స్టోన్స్ మరియు చిన్న పిల్లల పోలియో వ్యాధులకు యునాని మందుల ద్వారా చికిత్స చేయబడును. సంప్ర: M.D.షఫీ హకీమ్, కర్నూలు. సెల్: 93970 11918 [L-783334]

GYNECOLOGY

■ డా॥ కె.అరవింద MBBS, DNB, OBG గర్భిణీ మరియు స్త్రీ వ్యాధి నిపుణురాలు. 2PM To 5PM & 5 PM-9PM. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. ✆ 88970 87874 [L-796564]

GENERAL & LAPROSCOPIC SURGEON

■ KGN మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, KVR గార్డెన్, వడ్డగేరి, కర్నూలు. ఆరోగ్య శ్రీ ద్వారా అపెండిక్స్, మొలలు, హెర్నియా, థైరాయిడ్, కాలికి క్లోమాలు, ఆర్థోపెడిక్, యూరాలజీ, ENT, సర్జికల్ గ్యాస్ట్రో, మొ॥ శస్త్ర చికిత్సలు చేయబడును. ✆ 9346348653 [L-796563]

PHYSICIAN

■ డా॥కె.చంద్రమౌళీ రెడ్డి, Gen. MED, IDCCM, జనరల్ ఫిజిషియన్, ఫెలో ఇన్ క్రిటికల్ కేర్ యూనిట్, అడ్రస్: శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. సెల్: 88970 87874. [L-796565]

WANTED

■ కోడుమూరు ప్రముఖ సినిమా థియేటర్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. డ్యూటీ: 12 గంటలు, జీతం: 10వేలు. సంప్రదించండి: 9182964173. [L-796357]

■ Havells వాటర్ ప్యూరిఫైర్, గీజర్ కంపెనీలో పనిచేయుటకు టెక్నీషియన్స్ & సేల్స్‌మెన్స్ కావలెను. మంచి జీతం. సంప్ర: కర్నూలు జిల్లా. సెల్: 97019 45581 [L-796580]

■ ధనలక్ష్మి సీడ్స్ గోడౌన్ నందు సూపర్ వైజర్‌గా పని చేయుటకు కావలెను. అర్హత: ఇంటర్. జీతం: 10,000/-. సంప్ర: బళ్లారి చౌరస్తా దగ్గర, కర్నూలు. 94406 55739 [L-796579]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ ప్రతి రోజు 500 పేమెంట్. వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి వివరాలకు కాల్ చేయండి. 8247808801 [M-1185300]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024, 9640400073 [H-796284]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.7995365999 [HA-98715]

■ విజయవాడలో పేషెంట్‌లని, పెద్దవారిని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు నర్సులు (ANM, GNM) హాస్పిటల్స్‌లో పనిచేసిన ఆయాలు, హోమ్‌కేర్‌లో అనుభవమున్న కేర్ టేకర్స్ కావలెను. జీతం: 16K-26K కాల్/వాట్సప్ ✆ 91608 35559, 98850 25559 [B-264]

■ SR Defence Academy, Tirupati నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన PRO's & PET's కావలెను. Q:BPED, Any Degree, 7893318282, 6305789148. [T-1259119]

■ JOB VACANCY: Abs Group of Company. Full Time/ work from home.10th to Degree, Age : 18 to 35,15000 to 25000, ✆ 9182438437. [T-022]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

